సమగ్ర శిక్ష

కేజీబీవీల్లో వెట్టిచాకిరీ

- పనికి తగిన వేతనం లేక టీచర్లు, సిబ్బంది సతమతం
- సెలవులు తీసుకోవాలన్నా ఇబ్బందులే..
- విద్యాలయాల్లో తీవ్రంగా ఉద్యోగుల కొరత
- కేర్‌టేకర్, వాచ్‌వుమన్లు లేక భద్రత కరువు



భూపాలపల్లి పట్టణంలోని కేజీబీవీ పాఠశాల

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 24: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల సిబ్బందికి వెతలు తప్పడం లేదు. సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎంత వెట్టిచాకిరీ చేస్తున్నా పనికి తగ్గ వేతనం వీరికి అందడం లేదు. మందరూ మహిళలే అయినప్పటికీ వారికి కనీసం ఆప్షనల్ హాలీడేస్ దొరకడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. మరోవైపు హాస్టళ్లకు కేర్‌టేకర్లు, నైట్ వాచ్‌వుమన్లు లేక తమకు రక్షణ కరువుతోందనే ఆందోళన విద్యార్థినుల్లో వ్యక్తమవుతోంది.


జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 12 మండలాలు ఉన్నాయి. 11 మండలాల్లో కస్తూర్బా గాంధీ విద్యాల యాలు ఉన్నాయి. వీటిల్లో ప్రస్తుతం సుమారు 265 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. బోధన సిబ్బంది (టీచర్లు) 125 మంది, బో ధనేతర సిబ్బంది సుమా రు 140 మంది పని చేస్తున్నారు. ప్రస్తుతం కొత్తగా మరో 38 మందిని బోధన సిబ్బందిని నియమించేందుకు ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. అయినప్పటికీ ఈ విద్యాలయాల్లో సిబ్బంది కొరత ఇంకా ఉంది. 14 మంది టీచర్లు, 50 నుంచి 60 మం ది వరకు ఇతర ఉద్యోగులు అవసరం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

సమస్యలతో సతమతం

కేజీబీవీల్లో అనేక సమస్యలు ఉన్నాయి. వీటిని ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు ఎవరికీ చెప్పుకోలేక సతమతమవుతున్నారు. స్పెషల్ అధికారి, సీఆర్‌టీ సహా కంప్యూటర్ ఆపరేటర్ సిబ్బంది అంతా చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎస్‌వోలకు జీతం రూ.33వేలు కాగా సీఆర్‌టీలకు రూ.26 వేలు అందుతోంది. సీఆర్‌పీలకు రూ.19,500, అకౌంటెంట్లకు రూ.14,300, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.7,800 మాత్రమే ఇస్తున్నారు. అంతేకాదు.. ఏఎన్ఎంలు, నైట్ వాచ్‌వుమన్లు, డే వాచ్‌వుమన్లు, స్వీపర్లు, స్కావెంజర్లు.. ఇలా అందరికీ పనికి తగిన వేతనం ఇవ్వడం లేదనే ఆవేదన వ్యక్తమవుతోంది.

కేర్‌టేకర్లు, వాచ్‌వుమన్లు లేక..

11 విద్యాలయాల్లో నాలుగింటిలో కేర్‌టేకర్లు, నైట్‌వాచ్‌వుమన్లు లేక విద్యార్థినులకు భద్రత లేకుండా పోతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రధానంగా మల్హర్ మండలంలోని మల్లారం, గాదంపల్లి మధ్యలోని కేజీబీవీలో నైట్‌వాచ్‌వుమన్ లేక విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే టీచింగ్ స్టాఫ్ లేకపోవడంతో ఎనిమిది పీరియడ్లకు ఒకరే బోధించాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు విద్యాలయాల్లో స్కావెంజర్లు లేక తీవ్ర సమస్య తలెత్తుతోందని అంటున్నారు.



ఆప్షనల్ హాలీడేలు లేక..

కేజీబీవీలో మహిళా ఉపాధ్యా యులే విధులు నిర్వర్తిస్తుంటారు. ఏదైనా పెద్ద పండుగ వచ్చినప్పుడు ఆ మరుసటి రోజు సెలవు తీసుకోవడానికి సాధారణంగా ప్రభుత్వ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు ఆప్షనల్ హాలీడేలు అధికారులు మంజూరు చేస్తారు. కేజీబీవీల్లో మాత్రం అలాంటివి లేవని చెబుతున్నారు. హాలీడేలు లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని ఉపాధ్యాయినులు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డిమాండ్ ఇవే..

సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం స్కేలు అమలు చేయాలని డిమాండ్ వ్యక్తమవుతోంది. ప్రతి ఉద్యోగికీ జీవిత బీమా రూ.10లక్షలు వర్తింపజేయాలని, ఆరోగ్యబీమా రూ.5లక్షలు వర్తింపజేయాలని, విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజీ కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతున్నారు. పదేళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందిని పర్మనెంటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థినులకూ ఇబ్బందులే...

ఒక్కో కస్తూర్బాగాంధీ విద్యాలయంలో సుమారు 250 నుంచి 350 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. వీరంతా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలల్లో వేడినీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన సోలార్ సిస్టం పనిచేయడం లేదు. దీంతో విద్యార్థినులు చల్లని నీటితోనే స్నానం చేస్తున్నారు. మరుగుదొడ్లు సరిపోకపోవడంతో సమయం వృథా అవుతోందని వారు అంటున్నారు. పైగా పలుచోట్ల డోర్లు పాడైపోవడం, మరుగుదొడ్ల ట్యాంకులు నిండి వాటిని సకాలంలో శుభ్రం చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని చెబుతున్నారు. గతంలో మాదిరిగా న్యాప్కిన్స్ ఇవ్వడం లేదని, హెల్త్ కిట్‌కు బదులు రూ.100 చెల్లిస్తున్నారని తెలిపారు. అవి కూడా ఎప్పుడు మంజూరవుతాయో తెలియని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థినులు అంటున్నారు.

ములుగు మునిసిపల్ బిల్లుకు సహకరించండి

గవర్నర్‌ను కోరిన మంత్రి సీతక్క


గవర్నర్‌తో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు, సెప్టెంబరు 24: రాష్ట్రపతి పరిశీలనలో ఉన్న ములుగు మునిసిపాలిటీ బిల్లు ఆమోదానికి సహకారం అందించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క విజ్ఞప్తి చేశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మంత్రి మంగళవారం కలిసి సన్మానించారు. ఈసందర్భంగా జరిగిన భేటీలో జిల్లా కు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. 2022లో అప్పటి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన మునిసిపల్ చట్ట సవరణ బిల్లులో ములుగును మునిసిపాలిటీగా ఏర్పాటుచేస్తూ తీర్మానించారని, అయితే సుదీర్ఘ కాలంగా దీనికి గవర్నర్ ఆమోదం లభించలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇటీవల రాజ్‌భవన్ ఆమోదం రాగా రాష్ట్రపతి పరిశీలనకు పంపించారని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఈ బిల్లుకు ఆమోదం లభించేలా చొరవ చూపాలని గవర్నర్‌ను కోరారు. ఈవిషయంపై మంత్రి సీతక్క మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ములుగు జిల్లాలోని ఓ గ్రామాన్ని దత్త త తీసుకునేందుకు గవర్నర్ సానుకూలత వ్యక్తం చేశారని తెలిపారు. మునిసిపాలిటీ ఏర్పాటు కోసం ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోందని సీతక్క స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చిస్తానన్నారు. అవసరమైతే పెండింగ్ బిల్లును రీకాల్ చేసి వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో కొత్త బిల్లును ప్రవేశపెట్టేలా చర్యలు చేపడతానని సీతక్క వెల్లడించారు.

చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు భూసేకరణ పూర్తి చేయాలి

అధికారులతో భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

కాటారం, సెప్టెంబరు 24: చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ పనులు వేగవంతం చేయాలని, భూసేకరణ నెల రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. మండల కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుపై సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్‌తో కలిసి ఇరిగేషన్, రెవెన్యూ, సర్వే, ల్యాండ్ రికార్డ్స్, విద్యుత్, అటవీశాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. చిన్న కాళేశ్వరం స్టేజ్-1, స్టేజ్-2 పంప్‌హౌస్‌ల పరిధిలో జరుగుతున్న పనుల వివరాలను తెలుసుకున్నారు. మొదటి దశలో స్టేజ్-1 పంప్ హౌస్ నుంచి స్టేజ్-2 పంప్ హౌస్ వరకు నీటిని ఎత్తిపోయడానికి ట్రయల్ రన్ నిర్వహించేలా విద్యుత్ సరఫరా పనులకు ప్రతిపాదనలు పంపాలన్నారు. భూసేకరణ కోసం మండలాల వారీగా సర్వేయర్లను నియమించాలన్నారు. గారెపల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం చేపట్టిన భూసేకరణ, పరిహారం చెల్లింపులు, మిగిలి ఉన్న పరిహారం వివరాలను తెలుసుకున్నారు. కొందరు రైతులు పరిహారం అందలేదని చెప్పుండటంపై ఆరా తీసి పాత ఫైళ్లను పరిశీలించాలని ఆదేశించినట్లు సమచారం. అనంతరం తిమ్మన్నకుంటలో మినీ స్టేడియం నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. అక్రమణలపై

మిగతా 8వ పేజీలో...

నేడు చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

ఏటూరునాగారం, సెప్టెంబరు 24: రజక మండల కమిటీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం మండల కేంద్రంలోని వైజంక్షన్ వద్ద బుధవారం జరగనుంది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఎమ్మెల్సీ బస్వారాజు సారయ్య, శంషాబాద్ ఎమ్మెల్యే శంకర్రావుతో పాటు జిల్లా స్థాయి ఉన్నతాధికారులు హాజరుకానున్నట్లు రజక సంఘం కమిటీ సభ్యులు తెలిపారు.

మేడిగడ్డ బ్యారేజీలోకి 82,330 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 24 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. మంగళవారం బ్యారేజీలోకి 82,330 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద 1.90మీటర్ల ఎత్తులో ప్రవాహం కొనసాగుతోంది.


రామప్పలో 'ప్రసాద్' రెండో విడత పనులు

భూ సర్వే నిర్వహించిన అధికారులు


రామప్ప పరిసరాల్లో సర్వే చేపడుతున్న అధికారులు

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 24: ప్రసాద్ పథకంలో భాగంగా రూ.62 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో రామప్ప ఆలయం వద్ద చేపట్టనున్న అభివృద్ధి పనుల కోసం అధికారులు మంగళవారం భూ సర్వే నిర్వహించారు. కలెక్టర్ దివాకర ఆదేశాల మేరకు తహసీల్దార్ సదానందం, నీటిపారుదల శాఖ ఈఈ నారాయణ, డీఈ రవీందర్‌రెడ్డి, టూరిజం ఏఈ విజయ్, ఆర్ఐ రమేష్, ఐబీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మార్క దేవేందర్ పాలంపేటలోని 27 ఎకరాల భూమిని పరిశీలించారు. రామప్ప చెరువు మత్తడినీరు ఈ 27 ఎకరాల విస్తీర్ణం నుంచి పోవడం వల్ల పనులకు ఇబ్బంది కలగనున్న నేపథ్యంలో సుమారు ఏడెకరాలు వదిలిపెట్టాల్సి ఉంటుందని ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. 20 ఎకరాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఈ 27ఎకరాల భూమిని ఇప్పటికే రెవెన్యూశాఖకు పర్యాటకశాఖ అప్పగించింది. చెరువు మత్తడి ప్రభావితమయ్యే భూమిని గుర్తించడం ఆలస్యం కావడంతో అభివృద్ధి పనులు ప్రారంభంకాలేదు. మంగళవారం నిర్వహించిన సర్వే ప్రకారం చెరువు మత్తడి నీరు పోయేందుకు ఏడెకరాలను వదిలేసి తర్వాత 20ఎకరాల్లో అభివృద్ధి పనులకు మార్గం సుగమమైంది. ఈ ప్రదేశంలో యాంఫీ థియేటర్‌తోపాటు మరుగుదొడ్ల బ్లాకు, పర్యాటకుల సౌకర్యం కోసం వివిధ పనులు చేపట్టనున్నారు.

తప్పిపోయిన వ్యక్తి అనుమానాస్పద మృతి


రవి (ఫైల్)

- గుర్తుపట్టలేని విధంగా రెండు ముక్కలుగా మృతదేహం
- మూడురోజుల క్రితం అదృశ్యం కేసు నమోదు
- ఇది హత్యేనంటున్న కుటుంబ సభ్యులు

కన్నాయిగూడెం, సెప్టెంబరు 24: తప్పిపోయిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని ఏటూరులో చోటుచేసుకుంది. మృతదేహం రెండు ముక్కలుగా కుళ్లిపోయి మంగళవారం లభ్యమైంది. కన్నాయిగూడెం ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం... తాడ్వాయి మండలంలోని కాటాపూర్ గ్రామానికి చెందిన లంజపెల్లి రవి (30) కొన్నిరోజులుగా తమ అత్త గారిల్లు అయిన కన్నాయిగూడెం మండలంలోని ఏటూరులో నివసిస్తూ కూలి పనులు చేసుకుం టున్నాడు. మూడు రోజుల క్రితం వ్యవసాయ పనులకు వెళ్లిన రవి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అతడి మామ చిట్యాల లక్ష్మయ్య స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. మంగళవారం కంతనపల్లి పెద్ద చెరువు వైపు చేను పనులకు వెళ్లిన రైతులకు దుర్వాసన రావడంతో అనుమానంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఏటూరునాగారం సీఐ శ్రీనివాస్, కన్నాయిగూడెం ఎస్సై వెంకటేష్ మృతదేహాన్ని పరిశీలించారు. బాగా కుళ్లిపోయి రెండు భాగాలుగా గుర్తుపట్టలేని విధంగా శరీరం పడి ఉంది. అప్పటికే రవి మిస్సింగ్ కేసు నమోదై ఉండటంతో అతడి కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు చేతిపై ఉన్న పుట్టుమచ్చ ఆధారంగా మృతదేహం రవిదిగా గుర్తించారు. తన కుమారుడిది ముమ్మాటికీ హత్యే అని మృతుడి తండ్రి రాజబాబు ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టి దోషులను శిక్షించాలని పోలీసులను కోరారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య జ్యోతి, మూడేళ్ల కూతురు ఖుషి ఉంది.

ఓటరు నమోదును పకడ్బందీగా చేపట్టాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ములుగు కలెక్టర్ దివాకర, అధికారులు

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 24: జిల్లాలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈమేరకు మంగళవారం ఆయన హైదరాబాద్ నుంచి కలెక్టర్ దివాకరతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వారం రోజులుగా నూతన ఓటరు నమోదుపై చేపట్టిన ఇంటింటి సర్వే పనితీరు మెరుగుపడిందని, ఇప్పటి వరకు 90శాతానికిపైగా సర్వే పూర్తయిందని అన్నారు. ఈనెల 28 నాటికి వందశాతం పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఓటరు నమోదుకు సంబంధించి ఫారం-6,7,8 దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారి వివరాలతో నోటీసు జారీచేసి తొలగించాలన్నారు. ఇంటింటి సర్వేలో ఆధార్ నంబర్ సేకరణ తప్పనిసరికాదని, ఓటర్లు ఇష్టం ఉంటే ఇవ్వవచ్చని, బలవంతం చేయరాదని అన్నారు. నూతన ఓటరు నమోదు, దరఖాస్తుల వివరాలు, నూతన ఓటర్ల నమోదుకు సంబంధించిన అంశాలు రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలన్నారు. నూతన ఓటరు కార్డుల ముద్రణకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని, పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని, బూత్‌స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సమర్పించాలని అన్నారు. పోలింగ్ కేంద్రం లొకేషన్, ఫొటోలను బీఎల్‌వో యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. బీఎల్‌వో యాప్ వినియోగంపై బూత్‌స్థాయి అధికారులకు అవసరమైన శిక్షణ అందించాలని, పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ ప్రక్రియ డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురణ అక్టోబరు 29కి ముందు పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.

కాళేశ్వరాలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

- అధికారులు మాస్టర్ ప్లాన్ రూపొందించాలి
- సౌకర్యాలు మెరుగుపర్చాలి
- రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

వివరాలు 7వ పేజీలో


కాళేశ్వరం అభివృద్ధిపై సమీక్షిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

బకాయిలు ఇప్పించండి


ఎమ్మెల్యే సత్యనారాయణరావుకు మిల్లర్ల వినతి


ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు సమస్యలు వివరిస్తున్న మిల్లర్లు

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 24: తమకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు రైస్ మిల్లర్ల యజమానులు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన్ను మంగళవారం కలిసి తమ సమస్యలు విన్నవించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేసే ధాన్యంలో తేమ శాతం 14 ఉండేలా చూడాలని, ఎఫ్ఏక్యూ నాణ్యతా ప్రమా ణాల మేరకు సేకరించాలని కోరారు. పెండింగ్ బిల్లులు ఇప్పించి తమను ఆదుకోవాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మిల్లర్ల సంఘం ప్రధాన కార్యదర్శి నడిపెల్లి ప్రశాంత్‌రావు, కోశా ధికారి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు రేపాల్, సభ్యులు నర్సింగరావు, శ్రీనివాసరావు, రవీందర్, కార్తీక్ పాల్గొన్నారు.

గొల్లాలగుడి ధ్వంసంపై కేసు నమోదు

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 24: రామప్ప ఆలయ సమీపంలోని గొల్లాలగుడి ధ్వంసంపై కేసు నమోదైంది. ఈ మేరకు ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ స్మిత ఎస్.కుమార్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గొల్లాలగుడిలోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి ధ్వంసం చేసినట్లు ఈనెల 22న పురావస్తుశాఖ సిబ్బంది గుర్తించారని పేర్కొన్నారు. వాస్తుశిల్పం బాగా దెబ్బతిన్న స్థితిలో నేలపై ఉందని తెలిపారు. ఈఘటనపై పురావస్తుశాఖ సిబ్బంది వెంటనే వెంకటాపూర్ పోలీసులకు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. విచారణ చేపట్టిన పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని తెలిపారు. గొల్లాలగుడితోపాటు శివాలయం వద్ద నిరంతరం భద్రత సిబ్బందిని, నిఘా కెమెరాలను ఏర్పాటు చేయాలని స్థానిక అధికారులకు సూచించినట్లు పేర్కొన్నారు.





ఏచూరి మరణం అన్ని వర్గాలకు తీరనిలోటు

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ● కేయూలో సీతారాం సంస్మరణ సభ ● హాజరైన ప్రజాసంఘాల నేతలు, విద్యార్థులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 24: సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సీతారాం ఏచూరి మరణం ప్రజాస్వామ్య వాదులకు, అన్ని వర్గాల ప్రజలందరికీ తీరనిలోటని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కేయూక్యాంపస్‌లోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సెమినార్‌హాల్‌లో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ నేతృత్వంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ జరిగింది. ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షకార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

సీతారాం ఏచూరి గొప్ప ప్రజాస్వామ్యవాదని అని, అయన ఆశయాల సాధనకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. దేశంలో ఆర్థిక, రాజకీయ సంక్షోభాలకు సోషలిజమే శాస్త్రీయ పరిష్కారం చూపుతుందని చెప్పారు. కమ్యూనిస్టులు కార్మిక, కర్షక వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. ఏచూరి మరణం దేశ ప్రజానీకానికి, కార్మిక, కర్షక వర్గాలకు తీరనిలోటని చెప్పారు. 2020 జాతీయ నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని అన్నారు. దేశంలో విద్యతోనే అందరికీ ప్రజాస్వామ్య ఫలితాలను అందుతాయని చెప్పారు. ఆల్ ఇండియా వర్సిటీల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ.. అపర మేధావిగా, కమ్యూనిస్టు ఉద్యమ సారథిగా నిలిచిన సీతారాం ఏచూరి మరణం బాధాకరమన్నారు. సీపీఐ(ఎం) హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల చక్రపాణి మాట్లాడుతూ.. భవిష్యత్ అంతా కమ్యూనిస్టులదేనని చెప్పారు. వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ అంజన్‌రావు మాట్లాడుతూ.. యువతకు, కమ్యూనిస్టులకు సీతారాం ఏచూరి ఐకాన్‌గా నిలిచారని అన్నారు. సీఐటీయూ తెలంగాణ వర్సిటీల అధ్యక్షుడు మెట్టు రవి మాట్లాడుతూ.. కార్మిక వర్గాల స్ఫూర్తి ప్రదాత ఏచూరి అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఏచూరి ఆశయాల సాధనకు ఎస్ఎఫ్ఐ ముందుండి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థి ఉద్యమాలకు ఏచూరి అద్యుడని చెప్పారు. జేఎన్‌యూ కేంద్రంగా ఆయన చేసిన పోరాటం, అప్పటి ప్రధాని ఇందిరాగాంధీని ఎదురించిన ధీరత్వాన్ని కొనియాడారు. సభా ప్రారంభంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి అతిథులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ వర్సిటీ నేత కచ్చకాయల చిరంజీవి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్, అనూష, సహాయ కార్యదర్శులు జస్వంత్, పరిమళ, కేయూ అధ్యక్షుడు సాయి కిరణ్, నాయకులు కుమార్, సాయి, రాహుల్, కావ్య, ప్రవళిక, అనూష, ప్రదీప్, శిరీష, సందీప్, రాజ్‌కుమార్, వివిధ విద్యార్థి, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నర్సిరెడ్డి, పుల్లా శ్రీనివాస్ తదితరులు

ఇంతకీ ఆయనెవరు?

సాధారణ వ్యక్తికి బల్దియా సమావేశం వద్ద గౌరవమర్యాదలు

చర్చనీయాంశమైన పోలీసు అధికారి తీరు.. సోషల్ మీడియాలో వైరల్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 24: నగరంలో వివాదాస్పదుడిగా ముద్రపడిన ఓ సాధారణ వ్యక్తికి బల్దియా సమావేశం సందర్భంగా ఇచ్చిన గౌరవ మర్యాదలు చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. అసలు ఆయన ప్రజాప్రతినిధి కానేకాదు. ఆయనకూ మంగళవారం జరిగిన బల్దియా కౌన్సిల్ సమావేశానికి ఎలాంటి సంబంధం లేదు. ఆహ్వానం లేకపోయినా తన ఇద్దరు గన్‌మెన్‌లతో బల్దియా కార్యాలయానికి వచ్చాడు. ఇంకేముంది.. అక్కడి మెయిన్ గేట్ నుంచి సమావేశ మందిరం వరకు పోలీసులు కూడా గౌరవ మర్యాదలిస్తూ తీసుకెళ్లారు. ఓ పోలీసు అధికారి అయితే.. సదరు వ్యక్తి వస్తున్నాడన్న విషయం తెలుసుకుని సిబ్బందితో కలిసి ప్రధాన ద్వారం వద్దకు ఎదురేగి మరీ స్వాగతం పలికారు. తానే ముందుండి మరీ ఆయన్ను సమావేశ మందిరంలోకి తీసుకెళ్లారు. అంతేకాదు.. ఆయనే దగ్గరుండి సదరు వ్యక్తికి కమిషనర్ కార్యాలయం పక్కనే ఉన్న గదిలో విశ్రాంతి కల్పించారు. కౌన్సిల్ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలోనే సాధారణ ప్రజలు, మహిళా కార్పొరేటర్ల భర్తలు, వారి సహచరులను కూడా అనుమతించని పోలీసులు ఆ వ్యక్తికి రాచమర్యాదలు చేసి మరీ అనుమతించడం, ఆయనతో పాటు 20మంది అపరిచితులను కూడా రానివ్వడం చర్చనీయాంశమైంది. ఓ సాధారణ వ్యక్తికి ఇలా ప్రాధాన్యం ఇవ్వడం, ఓ పోలీసుఅధికారి ఆయనకు ఇచ్చిన గౌరవమర్యాదల గురించి సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. కొంత కాలంగా సదరు పోలీసు అధికారి ఆ సాధారణ వ్యక్తి గురించి మీడియా, ప్రజల సమక్షంలోనే పొగడ్తలతో ముంచెత్తడం వివాదాస్పదంగా మారింది. రాజకీయ నాయకులకు కొమ్ముకాస్తుండడం తెలిసి పోలీసు ఉన్నతాధికారులు సైతం ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న చర్చ జరుగుతోంది. దీనిపై సీపీ ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాల్సిందే మరీ.











జనం నాడి.. డాక్టర్ ఆమెడ..

● ప్రజావైద్యుడిగా చిరస్మరణీయుడు ● మానవతకు నిలువెత్తు నిదర్శనం ● నేడు డాక్టర్ ఆమెడ నారాయణ వర్ధంతి

హనుమకొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా గీసుగొండ మండలం మొగిలిచెర్లలో 26 ఏళ్ల కిందట జరిగిన ఓ అమానవీయ సంఘటన తాలూకు గాయం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల గుండెల్లో ఇప్పటికీ పచ్చిగానే ఉంది. సరిగ్గా ఇదే రోజు (1996 సెప్టెంబర్ 25)న ప్రజావైద్యుడు డాక్టర్ ఆమెడ నారాయణను కొందరు అంగతుకులు నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపిన సంఘటన ప్రజల జ్ఞాపకాల్లో సుడులు తిరుగుతూనే ఉంది. మొగిలిచెర్ల పేరు వినగానే నాటి నెత్తుటి దృశ్యం కళ్లకు కట్టినట్టు కనిపిస్తూనే ఉంటుంది. డాక్టర్ నారాయణ మొగిలిచెర్ల ప్రజల మనసుల్లో ఓ మనసున్న డాక్టర్‌గా, ప్రజాసేవకుడుగా ఇప్పటికీ నిలిచే ఉన్నాడనడానికి అక్కడ ఏ ఇంటి తలుపుతట్టినా వినిపిస్తుంది. ఆమెడ 28వ వర్ధంతి సందర్భంగా గత జ్ఞాపకాలు.

పేదరికాన్ని జయించి..

ఆమెడ నారాయణ నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన వారు. 1957లో ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా కురవి గ్రామంలో తల్లిదండ్రులు మహాలక్ష్మి, ముత్తయ్యలకు జన్మించారు. ఆరుగురు సంతానంలో ఆయన రెండోవారు. నారయణ పాఠశాల విద్యాభ్యాసం కురవిలోనే సాగింది. అనంతరం మహబూబాబాద్ జూనియర్ కాలేజీలో ఇంటర్ విద్య పూర్తి చేశాడు. ఆ తర్వాత హనుమకొండ సుబేదారిలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ చదువుతుండగానే మెడికల్ ఎంట్రెన్స్‌రాసి కాకతీయ వైద్యకళాశాలలో సీటు పొందాడు.

కార్యక్షేత్రం మొగిలిచెర్ల

అన్న నాగయ్య వామపక్ష భావజాలం నారాయణను ప్రభావితం చేసింది. విద్యార్థిగా ఉన్నప్పుడే ఎస్ఎఫ్ఐ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఆనాడు వరంగల్ విద్యార్థి యువజన, మేధావి వర్గాల్లో ప్రభావం చూపిన విప్లవోద్యమం ఆయనను కదలించింది. ఇదే అప్పటి సుప్రసిద్ధ ప్రజాహక్కుల నేత, పిల్లల డాక్టర్ రామనాథంకు దగ్గర చేసింది. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం,



నిబద్ధతను ఆయన నుంచే అందిపుచ్చుకున్నారు. ఎంబీబీఎస్ పూర్తిగానే డాక్టర్ ఆమెడ వైద్యాన్ని ఒక వృత్తిగా కాక సేవగా ఎంచుకున్నారు. అందుకు కార్యక్షేత్రంగా ప్రస్తుతం వరంగల్ జిల్లాలోని గీసుగొండ మండలం మొగిలిచెర్ల గ్రామాన్ని ఎంచుకున్నారు. ప్రజల కోసం పరితపించే పిల్లల వైద్యుడు రామనాథం చేతుల మీదుగా తన ప్రజావైద్యశాలను ప్రారంభించారు.

అప్పుడై..

అనతికాలంలోనే మొగిలిచెర్ల, దాని చుట్టుపక్కల 40 గామాల్లోకు దేవుడుగా మారారు. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు అవిశ్రాంతంగా వైద్య సేవలను అందించారు. వృత్తిధర్మం పట్ల ఎనలేని నిబద్ధత కలిగిన డాక్టర్ నారాయణ.. ఒక విశిష్టమైన దృక్పథాన్ని కలిగి ఉన్నప్పటికీ తరతమ భేదం లేకుండా అన్నివర్గాల ప్రజలకు సేవలు అందించారు. నక్సల్స్ మొదలు పోలీసుల వరకు అందరూ ఆయన వద్ద వైద్య సేవలు పొందినవారే.

రోగుల సేవలో..

వృత్తిధర్మాన్ని చూడలేని రాజ్యానికి ఆయన శృత్రువయ్యారు. అనేక సార్లు బెదిరింపులు ఎదుర్కొన్నాడు. అయినా ఏనాడు అదరలేదు. బెదరలేదు. ప్రజలకు అందుబాటులో ఉండాలని మొగిలిచెర్లలోనే భార్యాబిడ్డలతో మకాం పెట్టి, అనివార్య పరిస్థితుల్లో 1995లో తన నివాసాన్ని హనుమకొండలోని తన సొంత ఇంటికి మార్చుకున్నాడు. నివాసమైతే మారింది కానీ, ఆయన మనసెప్పుడు మొగిలిచెర్లలోని తన ప్రజావైద్యశాలకు వచ్చే రోగులమీదు ఉండేది. ప్రతీ రోజు ఉదయం 6 గంటలకే బయలు దేరి రాత్రి 9 గంటల వరకు రోగులకు సేవలు అందించేవారు. ప్రజలకోసం పనిచేసే వాళ్లంటే రాజ్యవ్యవస్థకు కంటగింపు. ప్రయాణంలో కూడా మార్గమధ్యలో రోగులు కనబడితే ఆగి వారికి మందులిచ్చే స్వభావం నారాయణది. ఆయనను చంపాలని పథకం వేసుకున్నవారు దీనిని అవకాశంగా తీసుకున్నారు.

ఆ రోజు..

1996 సెప్టెంబరు 25-సరిగ్గా అదే రోజు డాక్టర్ నారాయణ రోజువారిలాగానే ఉదయం స్కూటర్‌పై మొగిలిచెర్లకు వెళుతున్నాడు. మార్గమధ్యలో ఏనుమాముల మార్కెట్ వద్ద రోడ్డు పక్కన కాపు కాసిన అగంతుకుల్లో ఒకరు ఎదురువచ్చాడు. కడుపునొప్పితో విలవిలలాడుతున్నట్టు నటించాడు. నిజమేనని నమ్మిన డాక్టర్ నారాయణ.. ఆగి పరీక్షిస్తుండగా వెనుక నుంచి ఆయనపై తూటాల వర్షం కురిసింది. ఆయన అక్కడికక్కడే కుప్పకూలాడు. నారాయణ హత్యావార్త దావానంలా వ్యాపించింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాది మంది తరలివచ్చారు. మొగిలిచెర్ల శోకసముద్రమైంది. డాక్టర్ నారాయణ హత్యావార్త విన్న ప్రజలు, ముఖ్యంగా మహిళలు కనబరిచిన నిరసన అపూర్వం. కన్నీరుమున్నీరుగా విలపించిన ఆ జన సమూహమే డాక్టర్ ఆమెడకున్న ఆదరణకు సాక్ష్యం. భౌతికంగా డాక్టర్ నారాయణను లేకుండా చేసినా 30 ఊర్ల ప్రజల హృదయాల్లో ఇప్పటికీ నిలిచే ఉన్నారు. డాక్టర్ నారాయణ ఆదర్శాన్ని బతికించే కృషిలో ఆయనను సజీవంగా నిలుపుకోవడం కంటే మించిన నివాళి మరొకటి ఉండదు. డాక్టర్ నారాయణ అమరుడు. ఆయన ఆశయాలు నిరంతరం స్ఫూర్తిదాయం.



ఎమ్మెల్సీ కోదండరామ్‌ను సన్మానిస్తున్న టీజీవోలు

ఎమ్మెల్సీ కోదండరామ్‌కు టీజీవోల సన్మానం

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 24: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానభవన్‌లో మంగళవారం తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, వర్కర్స్ పెన్షనర్స్ జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కోదండరామ్‌ను సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఉమ్మడి వరంగల్ జిల్లా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీజీవో) అసోసియేషన్ నాయకులు పూలమాలతో సన్మానించారు. ఎమ్మెల్సీని సన్మానించిన వారిలో టీజీవోస్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు, జనగామ జిల్లా అధ్యక్షుడు అమ్జద్ అలీ, హనుమకొండ జిల్లా కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, నాయకులు రాజేష్ కుమార్, ఆస్నాల శ్రీనివాస్, నాగ నారాయణ, కృష్ణార్జునరావు ఉన్నారు.

నేడు వర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాల అవిర్భావ వేడుకలు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 24: కాకతీయ యూనివర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాల 11వ అవిర్భావ దినోత్సవ వేడుకలను వర్సిటీ సెనెట్ హాల్‌లో నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న బుధవారం 9.30 గంటలకు ప్రారంభమయ్యే వేడుకలకు కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నాగవాణి, గౌరవ అతిథులుగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈసీ మెంబర్ బి.సురేశ్‌లాల్, వర్సిటీ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్, ఈసీ మెంబర్ డాక్టర్ నిమ్మ. సుదర్శన్, ఈసీ మెంబర్ డాక్టర్ బి.రమారెడ్డి, ఈసీ మెంబర్ డాక్టర్ చిర్ర రాజు హాజరుకానున్నట్లు తెలిపారు. సభలో కన్వీనర్‌గా ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్‌గా బి.కిరణ్‌కుమార్ వ్యవహరిస్తారు.

హెడ్‌కానిస్టేబుల్ జయరాజ్‌కు స్ఫూర్తి సేవా రత్న జాతీయ అవార్డు



మడికొండ, సెప్టెంబరు 24: మడికొండ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ గుండబత్తిన జయరాజ్‌ను భారతీయ స్ఫూర్తి సేవారత్న జాతీయ అవార్డు వరించింది. బాలల రక్షణ, ప్రజారోగ్యం, మానవహక్కుల వంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా జయరాజ్ సేవలను గుర్తించిన స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఎన్‌జీవో వారు అవార్డును ప్రకటించారు. ఈ సందర్భంగా జయరాజ్‌ను పలువురు అభినందించారు. ఈనెల 29న హైదరాబాద్ కింగ్ కోఠిలోని సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో ప్రముఖుల చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నట్లు స్పష్టం చేశారు.

పిడుగుపడి వృదుడి మృతి



దుర్గం లక్ష్మయ్య(ఫైల్)

కొత్తగూడ, సెప్టెంబర్ 24 : కొత్తగూడ మండలం బత్తులపల్లి శివారు మంగళవారం పిడుగుపడి దుర్గం లక్ష్మయ్య (65) మృతి చెందాడు. కార్లాయి, బత్తులపల్లి గ్రామాల మధ్య మధ్యాహ్నం అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. పొలం వద్దకు కాపలాకు వెళ్లిన లక్ష్మయ్యపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య ఎల్లమ్మ, ఇద్దరు కూతుళ్ల ఉన్నారు.

దామగుండం అడవిని కాపాడుకుందాం

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 24: దామగుండం అడవిని కాపాడుకొని ప్రకృతి వైపరిత్యాలు జరుగకుండా రాష్ట్రాన్ని కాపాడుకుందామని డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ శ్రవణ్ పిలుపునిచ్చారు. దేశభద్రత పేరుతో వికారాబాద్ జిల్లాలోని దామగుండం రిజర్వ్ అడవుల్లో ఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్ ఏర్పాటును నిరసిస్తూ డీఎస్ఏ ఆధ్వర్యంలో హనుమకొండలోని అశోకా జంక్షన్‌లో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా శ్రవణ్ మట్లాడుతూ.. మూడువేల ఎకరాల్లో విస్తరించి దామగూడెం అడవుల్లో వణ్యప్రాణులు, ఔషద మొక్కలతో పాటు లక్షల వృక్షాలు పర్యావరణ హితంగా ఉన్నాయన్నారు. ఇంత పెద్ద రిజర్వ్ ఫారెస్టును తొలగించి రాడార్ స్టేషన్‌ను ఏర్పాటు చేయడం సరికాదన్నారు. రాడార్ స్టేషన్ వల్ల విడుదలయ్యే రేడియేషన్ ద్వారా సమీప గ్రామాల ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదముందన్నారు. ప్రభుత్వం వెంటనే రాడార్ స్టేషన్ ఏర్పాటును ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కోకన్వీనర్ గణేష్ నాయకులు శివ, శరత్, అనిల్, అభినయ్, శిరీష, చందన, కళ్యాణి, జయరాం, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.



అశోకా జంక్షన్‌లో ఆందోళన చేస్తున్న డీఎస్ఏ నాయకులు

ఐటీఐల్లో ఐదో విడత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 24: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ఐదోవిడత ప్రవేశాలకోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా వరంగల్, హనుమకొండ ప్రభుత్వ ఐటీఐల ప్రిన్సిపాళ్లు ఎం.చందర్, జి.సక్రు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత వెబ్ పోర్టల్‌లో ఈ నెల 28 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ ఐటీఐల్లో సంప్రదించాలని వారు కోరారు.

వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలి

సుబేదారి, సెప్టెంబరు 24: అక్టోబరు 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించుకోవాలని మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి బి.రాజమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నుంచి అక్టోబరు 1 వరకు వయోవృద్ధుల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 26న వృద్ధాశ్రమాల్లోని వయోవృద్ధులకు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, 27న వాకతాన్ ర్యాలీ, 28న తల్లిదండ్రుల పోషణ, సంక్షేమ చట్టం- 2007, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన సదస్సు, 29న పంచాయతీ సెక్రటరీలకు తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టం- 2007 అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఎల్డర్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 14567పై అవగాహన సదస్సు, ఈనెల 30న అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహణ చేపట్టనున్నట్లు రాజమణి పేర్కొన్నారు. అక్టోబరు 1న జిల్లా స్థాయిలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేటి నుంచి జంతుశాస్త్రంలో జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 24: సెప్టెంబరు 25, 26 తేదీల్లో రెండు రోజుల పాటు 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఎనిమల్ బయోటెక్నాలజీ 'అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు విభాగాధిపతి ప్రొఫెసర్ జి.షమిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, హైదరాబాద్ స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.గీతా వేముగంటిలు హాజరై కీలక ప్రసంగం చేస్తారని పేర్కొన్నారు. గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి పాల్గొంటారని తెలిపారు. అందరూ హాజరై సదస్సును విజయవంతం చేయాలని ఆమె కోరారు.

అజర ఆస్పత్రిలో కార్డియాలజీ దినోత్సవం

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 24: హనుమకొండలోని ములుగురోడ్‌లోని అజర ఆస్పత్రిలో ప్రపంచ కార్డియాలజీ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఈ నెల 29 వరకు ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రివర్గాలు వెల్లడించాయి. హృదయ సంబంధిత ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు అజర హాస్పిటల్స్ ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు పరీక్షలను ఉచితంగా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

సమాజ పురోభివృద్ధిలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల కృషి గొప్పది

ఎన్ఎస్ఎస్ అవిర్భావ వేడుకల్లో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 24: సమాజ పురోభివృద్ధిలో జాతీయ సేవ పథకం (ఎన్ఎస్ఎస్) వలంటీర్ల కృషి గొప్పదని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉద్బోధించారు. మంగళవారం కేయూ సెనెట్ హాల్‌లో కేయూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ అధ్యక్షత జరిగిన ఎన్ఎస్ఎస్ అవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ వల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వలంటీర్ల స్వీయ క్రమశిక్షణ కలిగి ఉండాలని, స్వచ్ఛత రోజువారి దినచర్యలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పనిని దైవంగా భావించాలన్నారు. చిన్న పనలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. వలంటీర్ల కరిక్యూలమ్‌లో సేవ ప్రధాన భాగమని చెప్పారు. ఏడాదిలో ఒక్కో వలంటీర్ 120గంటల పాటు సమాజ సేవ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని గుర్తు చేశారు. సమాజ రుగ్మతలను రూపుమాపాలని చెప్పారు. సేవలో భాగమే స్వచ్ఛత అని చెప్పారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లతోనే సమాజంలో మంచి మార్పులు వస్తాయని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిర్వహణ, బాలికల సంరక్షణ, నిఘా కెమెరాలు, స్వచ్ఛ భారత్‌పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ మాట్లాడుతూ.. యువత స్వామి వివేకానంద, మదర్ థెరిస్సా లాంటి మహనుభావులను రోల్ మోడల్‌గా తీసుకుని జీవితంలో ఎదగాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులను గౌరవించుకోవాలని కోరారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ.. మంచి సమాజ నిర్మాణంలో వలంటీర్లు నిజమైన సైన్యమని చెప్పారు. కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అమరవేణి, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏటీటీ ప్రసాద్, వివిధ కళాశాల ఎన్ఎస్ఎస్ పీవోలు, వలంటీర్లు పాల్గొన్నారు.

హోరెత్తించిన సాంస్కృతిక ప్రదర్శనలు

ఎన్ఎస్ఎస్ అవిర్భావ వేడుకలను పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మంగళవారం కేయూ సెనెట్‌హాల్‌లో చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు హోరెత్తించాయి. తెలంగాణ భాష, యాసలతోపాటు గిరిజన, కోయ సంస్కృతిని ప్రతిబింబించే నృత్య ప్రదర్శనలు చేశారు. తెలంగాణ బోనాలు, ఆదివాసీ నృత్యాలు, మిమిక్రీలు అంశాల్లో విద్యార్థులు పోటాపోటీగా ప్రదర్శనలు, నృత్యాలు చేశారు. యూనివర్సిటీ క్యాంపస్, వరంగల్ తూర్పు టీటీడబ్ల్యూఆర్‌డీసీ, ఆర్ట్స్ కళాశాల డిగ్రీ కళాశాల వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాళేశ్వరాలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

● అధికారులు మాస్టర్ ప్లాన్ రూపొందించాలి ● సౌకర్యాలు మెరుగుపర్చాలి ● రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

మహదేవపూర్, సెప్టెంబరు 24: కాళేశ్వరాలయాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సంకల్పించిందని, ఇందులో భాగంగా అధికారులు మాస్టర్ ప్లాన్‌ను రూపొంచాలని రాష్ట్ర దేవాదాలయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఆదేశించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వరాలయాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. కాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన ఆమెకు అర్చకులు ఆలయ సంప్రదాయ స్వాగతం, ఆశీర్వచనం పలికారు. అనంతరం ఆలయ కార్యనిర్వాహణాధికారి కార్యాలయంలో దేవాదాయ, పర్యాటకశాఖల అధికారులతో సమావేశమమైన శైలజా రామయ్యర్ దేవాలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్, సరస్వతీ పుష్కరాల నిర్వహణ, పర్యాటకంగా కాళేశ్వరాన్ని అభివృద్ధి చేయడం తదితర అంశాలపై సమీక్షించారు. తెలంగాణలోని శైవక్షేత్రాల్లో కాళేశ్వరం దేవాలయం ప్రధానమని, రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయనుందని తెలిపారు. ఆలయ ప్రాంగణాన్ని విస్తరించడం, పలు పునర్నిర్మాణాలు, ఆధునికీకరణ, యాత్రికులకు సౌకర్యాల కల్పన, వసతి, భోజన శాల, పార్కింగ్ స్థలాలు, సురక్షిత తాగునీటి సౌకర్యం తదితర అంశాలపై అధికారులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. దేవాలయ ప్రధాన ద్వారాన్ని శిల్పకలతో అలంకరించడం, గోదావరి ఘాట్ అభివృద్ధి, నది తీరాన్ని శుభ్రతతో, అందంగా అభివృద్ధి చేయడం, దేవాలయం చుట్టూ పర్యాటక మార్గాల అభివృద్ధి, స్థానిక సంస్కృతిక ప్రదర్శనలు, మ్యూజియం తదితర పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలు బిగించాలని, పోలీసు, రెన్యూ, పంచాయతీరాజ్, దేవాదాయ, పర్యాటక శాఖ అధికారులతో టాస్క్ ఫోర్స్ టీం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దేవాలయ అభివృద్ధికి ప్రత్యేకంగా మంజూరైన నిధులతో చేపట్టిన పనులు పూర్తిచేయాలని కలెక్టర్ రాహుల్ శర్మను ఆదేశించారు. కాళేశ్వరం దేవాలయాన్ని అభివృద్ధి చేయడం ద్వారా భక్తులు పెద్ద ఎత్తున వస్తారని, తద్వారా పుణ్యక్షేత్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. అస్థికలు గోదావరిలో కలిపేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు దేవాలయ ఆధీనంలో ఉన్న రూములను ఎందుకు కేటాయించడం లేదని దేవస్థానం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



కాళేశ్వరం ఆలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, కలెక్టర్ రాహుల్‌శర్మ

సమాచార పౌర సంబంధాల శాఖ, దేవాదాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ.. భక్తులకు సౌకర్యాల కల్పనలో రాజీ పడొద్దన్నారు. కాళేశ్వరం వచ్చే భక్తులు మహిళలు, పురుషులు బట్టలు మార్చుకునేందుకు గదులు ఏర్పాటు చేయాలన్నారు. నిర్మాణంలో ఉన్న 100 గదులను వెంటనే పూర్తి చేయాలన్నారు. మోడల్ మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. 2025లో జరిగే సరస్వతి పుష్కరాలనిర్వహణకు ఘాట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ రూ.19.39 కోట్ల ఎస్డీఎఫ్ నిధుల నుంచి రూ. 12.07 కోట్ల పనులు ఇప్పటికే పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులు భూ సమస్య వల్ల ఆగిపోయాయని తెలిపారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, పర్యాటక శాఖ జనరల్ మేనేజర్ ఉపేందర్‌రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, దేవాదాయ శాఖ ఉప కమిషనర్ శ్రీనాథరావు తదితరులు పాల్గొన్నారు.

గంగ పుత్రులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

బాలసముద్రం, సెప్టెంబరు 24: గంగ పుత్రులు (బెస్త) అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని తారా గార్డెన్‌లో 14వ గంగపుత్ర (బెస్త) నిర్మాణ సంస్థ ఎంఏసీ హౌసింగ్ సొసైటీ జనరల్ బాడీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై మాట్లాడారు. గంగ పుత్ర కుటుంబ సభ్యుల భవిష్యత్ కోసం సంఘం అండగా ఉంటుందన్నారు. గంగపుత్ర జాతి అభ్యున్నతి కోసం కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. సంఘంలో అందరు రిజిస్ట్రేషన్‌లు పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఏ సంఘానికి కూడా లేని 120 ఎకరాల లే అవుట్ గంగపుత్ర నిర్మాణ సంస్థ ఏర్పాటు చేసిందన్నారు. ఈ సమావేశంలో నలుగురు కొత్త సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారిగా ఇమ్మడి పుల్లయ్య వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డోలి రాజలింగం, దీటి మల్లయ్య, పారిపెల్లి రాజేందర్, ఎలుగు వెంకటేశ్వర్లు, వీరస్వామి, రాజేష్‌ఖన్నా, శ్రీనివాస్, బయ్య అనిల్, రామ్మూర్తి, జీ సుగుణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

నకిలీ కరెంటు సామగ్రి విక్రయం

రూ.28లక్షల నకిలీ వైర్లు, స్విచ్‌లు పట్టివేత

వరంగల్ క్రైం, సెప్టెంబరు 24: అక్రమ దందాలకు అడ్డాగా వరంగల్ నగరం మారుతోంది. గంజాయి, మట్కాలాంటి దందాలే కాకుండా కరెంటు పరికరాలు సైతం నకిలీవి విక్రయిస్తుండటం విశేషం. భవన నిర్మాణ రంగంలో వాడే ఎలక్ట్రికల్ వైర్లు, స్విచ్‌లను బ్రాండెడ్ కంపెనీల ముసుగులో నకిలీవి వరంగల్ నగరంలో విక్రయిస్తున్నారు. మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో అండర్ బ్రిడ్జి, శివనగర్ ప్రాంతంలో శ్రీపార్వతీ ఎలక్ట్రికల్స్ యజమాని చౌదరి ధనరావు నకిలీ దందా చేస్తున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. రూ.28లక్షల 67వేల విలువైన వైర్లు, స్విచ్‌లను స్వాధీనం చేసుకున్నారు. విక్రయిస్తున్న ధనరావును అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు విచారణ నిమిత్తం మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ రాజు ధ్రువీకరించారు.

వరంగల్, హనుమకొండను ఒకే జిల్లాగా ప్రకటించాలి

జిల్లాల ఏకీకరణ ఉద్యమ కమిటీ ఛైర్మన్ వెంకటనారాయణ



హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, పింగిళి సంపత్‌రెడ్డి

వడ్డేపల్లి, సెప్టెంబరు 24: వరంగల్, హనుమకొండ జిల్లాలను కలిపి ఒకే జిల్లాగా ప్రకటించాలని వరంగల్, హనుమకొండ జిల్లాల ఏకీకరణ ఉద్యమ కమిటీ ఛైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, కమిటీ సభ్యుడు పింగిళి సంపత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. భారతదేశ చరిత్రలో వరంగల్ నగరానికి, కాకతీయ సామ్రాజ్యంలో ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధిస్తే వరంగల్ నగరం హైదరాబాద్‌కు సమాంతరంగా ఒక ఆర్థిక, వాణిజ్య, విద్య, వైద్య ఉపాధి ఉద్యోగాలు కల్పించే కేంద్రంగా మారుతుందని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు ఆశించారని పేర్కొన్నారు. ఏ రాష్ట్రంలో ఏ ఉమ్మడి జిల్లాను రెండు నుంచి నాలుగు జిల్లాల కంటే ఎక్కువ విభజించలేదని తెలిపారు. వరంగల్ ఉమ్మడి జిల్లాను ఆరు జిల్లాలుగా చేసి ఇక్కడి రాజకీయ చైతన్యం, అభివృద్ధి, భౌగోళిక ఉనికి, నగర స్వరూపాన్ని విధ్వంసం చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం వరంగల్, హనుమకొండ జిల్లాలను ఒకే జిల్లాగా చేసి అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. సమావేశంలో జిల్లాల ఏకీకరణ ఉద్యమ కమిటీ సభ్యులు సోమ రామ్మూర్తి, దారం జనార్దన్, కోండ్ర నర్సింగరావు, సోమిడి శ్రీనివాస్, డాక్టర్ మంద వీరస్వామి, ఐతం నాగేష్, చిల్ల రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ ఫార్మసీ కళాశాలలపై కొరడా

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 24: కేయూ పరిధిలోని 10 ఫార్మాడీ కళాశాలు, అలాగే మరో 4 బీఫార్మసీ సీట్లలో కోత విధించి వర్సిటీ ఉన్నతాధికారులు కొరడా ఝుళిపించారు. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం 'అనుమతుల కోసం అడ్డదారులు' అనే శీర్షికతో వచ్చిన కథన కలకలం రేపింది. వర్సిటీ సీడీసీ డీన్ అధికారులు, ఫార్మసీ తనిఖీ అధికారుల నుంచి ప్రత్యేక నివేదికను తెప్పించుకుని సరైన వసతులు లేని కళాశాలలపై చర్యలకు దిగారు. వరంగల్ - హనుమకొండ, ఖమ్మంలోని 10 ఫార్మాడీ, మరో 4 బీఫార్మసీ కళాశాలల్లో గతంలో ఉన్న సీట్లలోనూ కోత విధించింది. ఈ మేరకు వర్సిటీ అధికారులు ఉత్తర్వులు వెలువరించారు.

బీఫార్మసీలో సీట్ల కోత విధించిన కళాశాలివే.. : కాకతీయ యూనివర్సిటీలో పరిధిలో 4 బీఫార్మసీ కళాశాలల్లో గతంలో ఉన్న 100 సీట్లకు బదులుగా ఈ ఏడాది 60 సీట్లకు తగ్గించారు. కోత పడిన కళాశాలల్లో ఖమ్మంలోని మహ్మదీయ కాలేజీ ఆఫ్ ఫార్మసీ, సహస్ర ఫార్మసీ కళాశాల హనుమకొండ, శ్రీ కాలేజీ ఆప్ ఫార్మసీ కొత్తగూడెం, శ్రీ కాకతీయ కాలేజీ ఆఫ్ ఫార్మసీ, హనుమకొండలున్నాయి.

పార్మాడీ కళాశాలివే.. : కేయూ పరిధిలో 1 ఫార్మాడీ కళాశాలలపై సీట్లపై వేటు పడింది. వాటిలో నర్సంపేటలోని బాలాజీ పార్మాడీ కాలేజీ, జయముఖి కాలేజీ, సోమిడి నేతాజీ పార్మాడీ కాలేజీ, హనుమకొండ సహస్ర పార్మాడీ కాలేజీ, ఖమ్మంలోని బ్రౌన్స్ ఫార్మాడీ కాలేజీ, మహ్మదీయ ఫార్మాడీ కాలేజీ, ఖమ్మం కాలేజీ ఫార్మాడీ, హనుమకొండ పాత్‌ఫైండర్, శ్రీ శివానీ పార్మాడీ కాలేజీ, ఎస్ఆర్ఆర్ పార్మాడీ కాలేజీలున్నాయి. ఆయా కళాశాలల్లో గతంలో ఉన్న 30సీట్లకు బదులుగా 20 సీట్లకు తగ్గించారు.

ఆర్‌సీవో కార్యాలయం తరలింపుపై తప్పుడు ప్రచారం : మంత్రి సీతక్క

ములుగు, సెప్టెంబరు 24: గిరిజన రీజనల్ కో ఆర్డినేటర్ కార్యాలయాన్ని మహబూబాబాద్ జిల్లా నుంచి ములుగుకు తరలిస్తున్నారంటూ తప్పుడు ప్రచారం జరుగుతోందని, దీనిని ప్రజలెవరూ నమ్మొద్దని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఒక ప్రకటనలో కోరారు. గిరిజన సంక్షేమ శాఖ సేవలు ములుగు, భూపాలపల్లి జిల్లాలకు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో సబ్ ఆర్‌సీవో కార్యాలయాన్ని ములుగులో ఏర్పాటు చేస్తున్నామని, ప్రస్తుతం మహబూబాబాద్‌లో ఉన్న ప్రధాన కార్యాలయం అలాగే కొనసాగుతుందని వెల్లడించారు. రాష్ట్ర మంత్రిగా ములుగుతోపాటు మహబూబాబాద్ జిల్లా అభివృద్ధిలో పాలుపంచుకుంటానని స్పష్టం చేశారు.

ప్రజారోగ్యాన్ని కాపాడాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

గణపురం, సెప్టెంబరు 24: గ్రామాల్లో ప్రజారోగ్యాన్ని కాపాడాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని ధర్మరావుపేటలో గండ్ర సమ్మారావు ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలంతా ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకుని, ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతిమ రిలీఫ్ మెడికల్ హాస్పిటల్ వైద్య సిబ్బంది, నాయకులు చోటేమియా, సమ్మిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, బాపని సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ములుగు ఎస్పీ శబరీశ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ శబరీశ్

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 24: జిల్లాలోని యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ శబరీశ్ అన్నారు. ములుగు మండలంలోని జాకారం గ్రామంలో డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో భాగంగా నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను ఎస్పీ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువత నైపుణ్యం ప్రపంచానికి తెలియాల్సి ఉందని, క్రీడలు ఉల్లాసానికే కాకుండా భవిష్యత్తుకు కూడా తీసుకోవాలని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచిన వారికి ఉన్నతస్థాయి ఉద్యోగాల్లో అవకాశాలు కూడా కల్పించడం జరుగుతుందని అన్నారు. గ్రామాల్లో గంజాయి అమ్మకం కాని, సేవించేవారు, ప్రభుత్వ స్థలాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించేవారు ఉంటే వారి సమాచారాన్ని పోలీసులకు అందించాలని సూచించారు. అనంతరం డ్రగ్స్ నిర్మూలన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ మహేశ్ భగవత్, అదనపు ఎస్పీ సదానందం, ములుగు డీఎస్పీ రవీందర్, డీసీఆర్‌బీ డీఎస్పీ రాములు, సీఐ శంకర్, పస్రా సీఐ రవీందర్, జిల్లాలోని ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట

ఏటూరునాగారం, సెప్టెంబరు 24: మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట వేస్తోందని ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా మహిళా అధ్యక్షురాలు రేగా కల్యాణి అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ మండల కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మహిళలకు సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలన్నారు. మహిళలు అఖిల భారత మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదు పొంది పార్టీకి సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. ఆయా సంక్షేమ పథకాల్లాగే మహిళలకు త్వరలోనే ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్నఎల్లయ్య, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు కట్కూరి రాధిక, మండల మహిళా కోర్డినేటర్ గికూరి భాగ్య, మాజీ ఉప సర్పంచ్ కర్ల అరుణ, మహిళా కార్యకర్తలతో పాటు సుమారు 50 మంది మహిళలు పాల్గొన్నారు.

రైతులు మెలకువలు పాటించాలి

చిట్యాల, సెప్టెంబరు 24: రైతులు పంటల సాగులో వ్యవసాయ అధికారుల సూచనలు, మెలకువలు పాటించాలని చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి అన్నారు. స్థానిక రైతువేదికలో పోతన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మిరప పంట సాగు రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. సేంద్రియ పద్ధతిలో వ్యవసాయ పంటల సాగు, పంట కోతలు, క్రయవిక్రయాలు, వాతావరణ మార్పు - సస్యరక్షణ చర్యలు, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందే విషయాలపై మాస్టర్ ట్రైనర్ ఉపేందర్‌రెడ్డి వివరించారు. వెంకట్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి సునీల్, ఏఈవోలు రమణకుమార్ పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో ఎస్సైల పాత్ర కీలకం

భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే



ట్రైనీ ఎస్సైలతో ఎస్పీ కిరణ్ ఖరే

కృష్ణకాలనీ (భూపాలపల్లి), సెప్టెంబ రు 24: శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్సైల పాత్ర కీలకమని భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. శిక్షణలో ఉన్న ఎస్సైలకు జిల్లాలోని 11 పోలీస్‌స్టేషన్లలో పనిచేసేందుకు ఎస్పీ విధులు కేటాయించారు. శిక్షణలో ఉన్న ఎస్సైలు విధి నిర్వహణలో ప్రత్యేకత చాటుతూ శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలన్నారు. శిక్షణలో చివరి ఘట్టంలో మండల స్థాయి ప్రజల మదిల తమదైన ముద్ర వేయాలన్నారు. మహిళల భద్రత, నేరాలు, దొంగతనాలు అరికట్టడం, సైబర్ నేరాల నియంత్రణ పోలీసుల లక్ష్యమ న్నారు. జిల్లాలో డ్రగ్స్ నిర్మూలనపైన ఇచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ట్రైనీ ఎస్సైలు ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేశారు.

3న సింగరేణి కార్మికులకు దసరా అడ్వాన్స్ చెల్లింపు

కాకతీయఖని, సెప్టెంబరు 24: సింగరేణి కార్మికులకు అక్టోబరు 3న దసరా అడ్వాన్స్‌ను యాజమాన్యం చెల్లించనుంది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అండర్ గ్రౌండ్‌లో 190, సర్ఫేజ్‌లో 240 మస్టర్లు పూర్తి చేసిన హిందూ కార్మికులకు రూ. 25 వేలు అడ్వాన్స్ రూపంలో లభించనుంది. అలాగే అండర్ గ్రౌండ్‌లో190, సర్ఫేస్‌లో 240 పూర్తి కాని బదిలీ వర్కర్లకు రూ. 12,500 చెల్లించనున్నట్లు యాజ మాన్యం ప్రకటించింది. అక్టోబరు 3న కార్మికుల ఖాతాల్లో రూ. 89 కోట్లు జమ చేయనున్నట్లు సింగరేణి అధికా రులు వెల్లడించారు. కార్మికులకు ఇచ్చిన అడ్వాన్స్ సొమ్మును యాజ మాన్యం తిరిగి నెలనెలా రికవరీ చేస్తుంది.

ఆలయాల్లో ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రత్యేక పూజలు

మహదేవపూర్, సెప్టెంబరు 24 : మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వరాలయాన్ని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మంగళవారం సందర్శించారు. స్వామిని దర్శించుకున్న ఆమెకు అర్చకులు, ఆలయ ఈవో మంగళవాయిద్యాలు, వేద మంత్రాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ముక్తీశ్వర స్వామికి పూజల అనంతరం శుభానంద దేవి ఆలయంలో శైలజా రామయ్యర్ పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో మారుతి ఘనంగా సన్మానించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. సరస్వతి ఆలయంలోనూ ఆమె పూజలు నిర్వహించారు. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



దత్తాత్రేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న శైలజా రామయ్యర్

దత్తాత్రేయస్వామి ఆలయంలో..

కాటారం : మండలంలోని ధన్వాడ శ్రీ దత్తాత్రేయస్వామి ఆలయాన్ని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ సందర్శించి దేవుడికి పూజ చేసి మొక్కుకున్నారు. దేవాదాయశాఖ కమిషనర్ హన్మంతరావు, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ, అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, దేవాదాయశాఖ అధికారులతో కలిసి ఆలయాన్ని సందర్శించారు. వారికి వేద పండితులు కృష్ణమోహన్‌శర్మ, సుమిత్‌పాండే ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో శ్రీదత్తాత్రేయస్వామితో పాటు ఆవరణలోని గణపతి, హనుమాన్, కాశీ కేదారేశ్వరస్వామి, అమ్మవార్లను దర్శింపజేసి పూజలు చేయించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి నేతృత్వంలో సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఏఎంసీ యార్డుకు ప్రహరీ నిర్మించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

కాటారం, సెప్టెంబరు 24: కాటారం వ్యవసాయ మార్కెట్ యార్డు స్థలం చుట్టూ ప్రహరీని నిర్మించి భూమిని పరిరక్షించాలని అధికారులను భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. మంగళవారం కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, సర్వే, ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమకుమారితో కలిసి మార్కెట్ యార్డును సందర్శించారు. మార్కెట్ యార్డు స్థలాన్ని ఇటీవల సర్వే, ల్యాండ్ రికార్డ్స్ అధికారులు సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేశారు. ఎకరానికి పైగా భూమి కబ్జాకు గురైనట్లు నివేదిక ఇచ్చారు. సర్వే రికార్డులను పరిశీలించిన కలెక్టర్ మాట్లా డుతూ ఏఎంసీకి ఉండాల్సిన 12ఎకరాల 9 గుంటలను పరిరక్షిస్తూ కబ్జాకు గురైన స్థలాలను వెంటనే స్వాధీనం చేసుకుని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఇండేన్ గ్యాస్ డీలర్ జయరాజ్ 2012లో సర్వే చేసి ప్రహరీ నిర్మించగా తన గ్యాస్ గోడౌన్‌కు దారి ఏర్పాటు చేసుకున్నానని, ఇప్పుడు సర్వే చేసి గోడౌన్‌కు వెళ్లే దారి ఏఎంసీదేనని చూపడం ఏమిటని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సర్వే రికార్డుల ప్రకారం చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, ఆర్‌ఐ వెంకన్న, ఏఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలను సీజ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

గోవిందరావుపేట, సెప్టెంబరు 24: మండలంలోని పస్రాలో ఎలాంటి సౌకర్యాలు లేని ప్రైవేట్ పాఠశాలను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిరిపల్లి జీవన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన మంగళవారం పాఠశాలను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు అనుగుణంగా పూర్తిస్థాయిలో బాత్‌రూంలు, ఫ్యాన్లు, ఫర్నిచర్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, క్వాలిఫై టీచర్లు కూడా లేరని ఆరోపించారు. జిల్లా ఉన్నతాధికారులు పాఠశాలపై విచారణ జరిపి సీజ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

మంగపేట, సెప్టెంబరు 24: ప్లాస్టిక్ నిషేధంపై గ్రామస్థులకు అవగాన కల్పిస్తూ మండలంలోని కమలాపురంలో జన విజ్ఞాన వేదిక, జ్వాల ట్రస్ట్, కమలాపురం గ్రామ పంచాయతీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల నుంచి ఈ ప్రదర్శన ప్రారంభమైంది. అనంతరం మానవహారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి ఎంపీడీవో భద్రు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేధిక ములుగు జిల్లా అధ్యక్షుడు కొయ్యడ మల్లయ్య, ఎంపీడీవో బి.శ్రీకాంత్, మంగపేట పంచాయతీ కార్యదర్శి జె.అరుణ్, జ్వాల ట్రస్ట్ మండల ప్రధాన కార్యదర్శి, జేవీవీ జిల్లా హెల్త్ కమిటీ కన్వీనర్ మునిగాల రాకేష్, జేవీవీ జిల్లా ప్రధానకార్యదర్శి గడ్డి శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారిగా బాబూరావు

రేగొండ, సెప్టెంబరు 24: మండల ప్రత్యేకాధికారిగా జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ బాబూరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రాంప్రసాదరావు, కార్యాలయ పర్యవేక్షకుడు శ్రీనివాస్‌తో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయన సమావేశమయ్యారు. ప్రజా సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు.

‘చలో హైదరాబాద్’ను విజయవంతం చేయాలి

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 24: ఆర్టిజన్ల కన్వర్షన్ అమలును కోరుతూ చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వేలాదిగా హాజరై విజయవంతం చేయాలని విద్యుత్ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ కోటి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 26న హైదరాబాద్‌లోని టీజీ ఎన్‌పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట మహా ధర్నా చేపట్టినట్లు తెలిపారు. జిల్లా నుంచి వందలాదిగా కార్మికులు తరలిరావాలని కోరారు.

తత్కాల్‌లో ‘ఓపెన్’ ఫీజు చెల్లింపు

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 24: ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు రాయాలనుకున్నవారు ఈ నెల 30లోగా తత్కాల్ స్కీమ్ కింద ఫీజు చెల్లించాలని డీఈవో రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ స్కూల్ నందు విద్యనభ్యసిస్తున్న వారు పదవ తరగతి చదివితే ఈ నెల 30వ తేదీ లోపు రూ.500 అపరాధ రుసుం చెల్లించాలని, అలాగే ఇంటర్మీడియట్ పరీక్షల కోసం రూ.1000 చెల్లించాలని కోరారు. ఈ నెల 30 నుంచి హాల్‌టిక్కెట్‌లు ఇవ్వడం జరుగుతుందని, అక్టోబరు 3 నుంచి పరీక్షలు ఉంటాయని తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతంగా కొనసాగించాలి : బలరాం



సభ్యత్వాన్ని నమోదు చేయిస్తున్న బలరాం

ములుగు, సెప్టెంబరు 24: సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం శ్రేణులను కోరారు. జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. వికసిత భారత్ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయకు నివాళిగా అత్యధిక సభ్యత్వాలు చేయించి ములుగు జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జినుకల కృష్ణాకర్‌రావు, ములుగు మండల అధ్యక్షుడు గాదం కుమార్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాయంచు నాగరాజు, నాయకులు భైకాని మహేందర్, సాగర్, దుగ్గినేని భాను, శాతరాజు విక్రాంత్, కట్టయ్య, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను పరిశీలించిన డీఎంహెచ్‌వో

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 24: ములుగు మండలంలోని అబ్బాపురం, బాణాలపల్లి, కుమ్మరిపల్లి, శ్రీరాములపల్లి గ్రామాల్లో వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వైద్యశిబిరాలను డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య పరిశీలించారు. అంతకుముందు ఆయన ఆయా గ్రామాల్లోని వీధుల్లో తిరుగుతూ నీటినిల్వలను తొలగింపజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు సీజనల్ వ్యాధులబారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ శిబిరాల్లో డాక్టర్‌లు రణధీర్, ప్రసాద్, ప్రేమ్‌సింగ్, దీపిక, దీప్తి, నవ్యరాణి, శ్రవణ్, నందకిషోర్, జితేందర్, నవ్యశ్రీ, ఏఎంవో దుర్గారావు, ప్రజాప్రతినిధులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి విజయభాస్కర్

గణపురం, సెప్టెంబరు 24: కురుస్తున్న వర్షాలతో పంట చేలల్లో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయభాస్కర్ అన్నారు. మంగళవారం మండల శివారులో పంట పొలాలను వ్యవసాయ సహాయ సంచాలకులు రమేష్, ఏవో ఐలయ్యతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. పత్తి పంటలో నీరు నిల్వ ఉంచకూడదని, వరి పంటలో అగ్గి తెగులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మిరపలో వేరుకుళ్లు రాకుండా పంటలను ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు మౌనిక, కళ్యాణ్, రైతులు తదితరులు ఉన్నారు.

పట్టాలివ్వాలని జర్నలిస్టుల నిరసన

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 24: మండలంలోని పాలంపేట గ్రామంలోని ప్రభుత్వభూమిలో గుడిసెలు వేసుకున్న తమకు పట్టాలందించాలని మండలంలోని జర్నలిస్టులు మంగళవారం పరకాల-ములుగు ప్రధాన రహదారిపై బైఠాయించారు. రామప్ప జర్నలిస్టు సొసైటీ అధ్యక్షుడు బేతి సతీష్ మాట్లాడుతూ పాలంపేట గ్రామంలోని ప్రభుత్వభూమిలో పదినెలల క్రితం మండలంలోని జర్నలిస్టులు గుడిసెలు వేసుకున్నారని అన్నారు. తమకు పట్టాలు అందించాలని పలుమార్లు రాష్ట్ర మంత్రి సీతక్క, కలెక్టర్, తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందజేశామన్నారు. రెవెన్యూ అధికారులు గుడిసెలను తొలగించారని, ఇది సరికాదని విమర్శించారు. తహసీల్దార్ సదానందం, ఎస్సై సతీష్ అక్కడికి చేరుకొని జర్నలిస్టుల సమస్య పరిష్కారం కోసం కృషిచేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు దేశిని మహేందర్, గోరంటాల విజయ్, తీగల యుగంధర్, రంగిశెట్టి రాజేందర్, కేతిరి భిక్షపతి, ఆలుగొండ రమేష్, మునిగాల రాజు తదితరులు పాల్గొన్నారు.

12 శాతం రిజర్వేషన్ సాధించే వరకు మాదిగలు ఉద్యమించాలి

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబరు 24: 12శాతం రిజర్వేషన్ సాధించే వరకు మాదిగలు ఉద్యమించాలని మాదిగ జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు యాసం రమేష్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన మాదిగ జేఏసీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 12శాతం రిజర్వేషన్ అమలు చేయాలని మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు పిడమర్తి రవి చేపట్టిన మేలుకొలుపు యాత్ర ఈనెల 29న ములుగు జిల్లాకేంద్రానికి రానుందని అన్నారు. ఈయాత్రలో మాదిగలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈసమావేశంలో నాయకులు యాసం శ్రీను, తోకల అంజి, తేజ, నర్సింహారావు, చెన్నం గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

కేటీకే-5వ గనిలో ఐఎన్‌టీయూసీ గేట్ మీటింగ్

కాకతీయఖని, సెప్టెంబరు 24: సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-5వ గని ఆవరణలో ఐఎన్‌టీయూసీ నాయకులు మంగళవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘం బ్రాంచి ఉపాధ్యక్షుడు బుచ్చయ్య హాజరయ్యారు. సింగరేణి కార్మికులకు 33శాతం లాభాల వాటా ఇప్పించిన ఘనత ఐఎన్‌టీయూసీదే అన్నారు. కార్మికుడు అనారోగ్యానికి గురైతే హెల్త్ అగ్రిమెంట్ ప్రకారం రూ.8 లక్షల వరకు ఖర్చు చేయలేని పిరిస్థితి ఉండేదని, అలాంటిది ఎంత ఖర్చు అయినా కార్మికుడికి నయమయ్యే వరకు వైద్యం అందించేలా యాజమాన్యాన్ని ఒప్పించిన ఘనత ఐఎన్‌టీయూసీదని అన్నారు. నూతన బొగ్గు గనులను తెచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుంటే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం బొగ్గు బ్లాకులను ప్రైవేటురం చేసేందుకు పూనుకుంటుందన్నారు. దీపావళి బోనస్ రూ. లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేష్, రాజు, సంపత్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

‘చిన్న కాళేశ్వరం’ భూసేకరణ పూర్తి చేయాలి

(5వ పేజీ తరువాయి)

సర్వే చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఈఈ యాదగిరి, ఎస్‌డీసీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ నాగరాజు, డీవైఎస్‌వో జైపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇచ్చే వరకు పనులు సాగనివ్వం

చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా చేపట్టిన గారెపల్లి నూతన రిజర్వాయర్ కింద భూములు కోల్పోయామని, పరిహారం ఇచ్చేవరకు పనులు సాగనివ్వమని పలువురు రైతులు కలెక్టర్ రాహుల్‌శర్మకు తెలిపారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద వినతిపత్రం అందించారు. ఏళ్లు గడుస్తున్నా 50మందికి పైగా రైతులకు ఇప్పటి వరకు పరిహారం అందలేదన్నారు. పరిహారం విషయమై పలుమార్లు సర్వేలు చేస్తూ మభ్యపెడుతున్నారని తెలిపారు. ఓ సారి అందరికీ పరిహారం అందిందని, మరోసారి చర్యలు తీసుకుంటామని చెప్పుండటంపై అనుమానంగా ఉందన్నారు. భూములకు నిజమైన యజమానులైన తమకు పరిహారం ఇవ్వకుంటే పనులు సాగనివ్వమన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు బలరాం, రాజేందర్, సంతోష్, సురేష్, మల్లయ్య, రాజయ్య, సమ్మక్క, పోసక్క, లక్ష్మి, కొమురయ్య, బాపు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడలు ప్రారంభం

మొగుళ్లపల్లి, సెప్టెంబరు 24: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఆవరణలో 68వ మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు మంగళవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయపాల్‌రెడ్డి ప్రారంభించారు. అండర్ 14,17 బాలబాలికలకు జరిగిన ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో తొమ్మిది పాఠశాలల క్రీడాకారులు పాల్గొనగా 144మంది క్రీడాకారులు జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. ఈసందర్భంగా హెచ్‌ఎం విజయపాల్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అన్నారు. మండలస్థాయిలో మెరుగైన ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని సూచించారు. ఈకార్యక్రమంలో పీడీ గుండెల్లి రాజయ్య, పీఈటీలు అజయ్, సందీప్, కార్తీక్, సురేష్, శ్రీనివాసరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మొగుళ్లపల్లి, సెప్టెంబరు 24: మండలంలోని పాత ఇస్సిపేట గ్రామంలో జన్ని సాయిశ్రీ అనే చిన్నారి ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట చిట్యాల మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొడారి రమేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బలుగూరి తిరుపతిరావు, నాయకులు వెంకట్రావు, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

విద్యాలయాల్లో సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

కాటారం, సెప్టెంబరు 24: కాటారం సబ్ డివిజన్ పరిధిలో ఉన్న గురుకుల విద్యాలయాలు, మోడల్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరణ్ డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈ మేరకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మహాముత్తారం మండలం దొబ్బలపాడు మోడల్ స్కూల్‌లో హాస్టల్ నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టి విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు అజయ్, విష్ణువర్ధన్, అంజి పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

కాటారం, సెప్టెంబరు 24: పెద్దపల్లి జిల్లా నుంచి కాటారం షిఫ్ట్ అయిన మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకులంలో మగళవారం ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది విద్యార్థులకు పలు రకాల పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ వందన, హెచ్‌ఏ సమ్మయ్య, ఏఎన్‌ఎం శ్యామల, ఆశా కార్యకర్త రాజేశ్వరి, వార్డెన్ తదితరులు పాల్గొన్నారు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గణపురం, సెప్టెంబరు 24: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి మధుసూదన్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఓపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బుద్దారంలో పోషకాహార లోపం ఉన్న పిల్లలకు మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. పీహెచ్‌సీ సిబ్బంది అనూష, రచన, సుజాత, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడోత్సవాలకు ఏర్పాట్లు

వాజేడు, సెప్టెంబరు 24: ములుగు జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులకు క్రీడలు నిర్వహించేందుకు మండలంలోని పేరూరు ఆశ్రమ పాఠశాలను ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో పాఠశాల క్రీడా మైదానాన్ని స్పోర్ట్స్ ఆఫీసర్ శ్యామలత, పీడీలు లక్ష్మీనారా యణ, నాగేంద్రకుమార్, సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. ఈనెల 27న క్రీడోత్సవాలను ప్రారంభించ నున్నట్లు పేర్కొన్నారు. వారి వెంట ఉపాధ్యాయులు భద్రా చలం, నర్సింగరావు, నాగేంద్రప్రసాద్, శ్రీను, పార్వతి, ఈశ్వర్ ఉన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న ఆరెవాగు

మల్హర్, సెప్టెంబరు 24: ఎగువన కురుస్తున్న వర్షాలతో మండలంలోని ఆరెవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గత రాత్రి, మధ్యాహ్నం కురిసిన వర్షంతో సాయం త్రానికి ప్రవాహం పెరిగింది. దీంతో రైతులు వాగులోని మోటార్లు, స్టాటర్లు తీసేందుకు ఇబ్బందులు పడ్డారు. మానేరులో ప్రవాహం నిలకడగా సాగుతోంది.



మల్లారం వద్ద ఆరెవాగు ఉధృతి